కిక్కురుమనని.. కియోస్క్‌లు !

- నిరుపయోగంగా 73 కియోస్క్‌లు
- కియాస్క్ స్థానంలో పీఎంఏఐడీ యాప్
- కొత్త యాప్‌లో అరకొర సేవలు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులు

లింగసముద్రం:

గ్రామ స్వరాజ్య స్థాపనే లక్ష్యంగా సచివాలయం, రైతు సంక్షేమమే ధ్యేయంగా ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రం సైతం నిర్వీర్యం చేసే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ముఖ్యంగా రైతులు వారి గ్రామాల్లోనే నాణ్యమైన విత్తనాలు, పురుగు మందులతో పాటు వారికి అవసరమైన సేవలు అందించేందుకు గత ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఎరువులు, పురుగు మందులు కొనుగోలు కోసం రైతు సేవా కేంద్రాలకు సమకూర్చిన కియోస్క్‌లు మూలన పడ్డాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన పథకాలు, కార్యక్రమాలను నీరుగార్చేందుకు కూటమి ప్రభుత్వం కంకణం కట్టుకుంది. ఇప్పటికే గత ప్రభుత్వం అమలు చేసిన పలు పథకాలను రద్దు చేస్తుండగా మరికొటిన్నిటికి పేర్లు మార్చేసింది. రైతులకు కావాల్సిన వ్యవసాయ సేవలను ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసేందుకు వీలుగా కియోస్క్ యంత్రాలను ఆర్‌ఎస్కేల్లో ఏర్పాటు చేసింది. అయితే ప్రస్తుతం కియోస్క్‌లు రైతుసేవా కేంద్రాల్లో నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. రైతులకు కావాల్సిన ఎరువులు, యంత్ర పరికరాలు, పశువుల దాణా, మార్కెటింగ్ వంటి అన్ని రకాల సేవలు ఆన్‌లైన్‌లో పొందేందుకు గత ప్రభుత్వం కియోస్క్ యంత్రాలను ఏర్పాటు చేశారు. అలాగే రైతులకు కావాల్సిన ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు, యంత్ర పరికరాలను ఆన్‌లైన్‌లో ముందుగానే నమోదు చేసుకునేవారు. ఆయా ప్రాంతాల్లో వ్యవసాయ ఉత్పత్తుల ధరలు, వ్యవసాయ పంట యాజమాన్య పద్ధతులపై సమాచారం వీడియోల రూపంలో తెలుసుకునేవారు. కూటమి ప్రభుత ఏర్పడ్డాక ప్రభుత్వ సర్వర్లు పనిచేయకపోవడంతో సచివాలయ సేవలు ఒక్కొక్కటిగా నిలిచిపోతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు.



లింగసముద్రంలో ఏర్పాటు చేసిన రైతు సేవా కేంద్రం

నియోజకవర్గంలో 73 ఆర్‌బీకేలు..

నియోజకవర్గంలోని కందుకూరు రూరల్, లింగసముద్రం, వలేటివారిపాలెం, ఉలవపాడు, గుడ్లూరు మండలాల్లో గత ప్రభుత్వం 73 ఆర్‌బీకేలను ఏర్పాటు చేసింది. కూటమి ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలను రైతు సేవా కేంద్రాలుగా పేరు మార్చింది. ఈ కేంద్రాల్లో కియోస్క్ యంత్ర పరికరాలను రైతులకు సేవలు అందించేలా ఏర్పాటు చేశారు. అయితే ప్రస్తుతం కియోస్క్‌లను కేవలం ఎరువుల అమ్మకాలకు మాత్రమే ఉపయోగిస్తూ మిగిలిన సేవలకు దూరంగా ఉంటున్నాయి. అయితే అధికారులు మాత్రం వాటిని వినియోగిస్తున్నామని చెప్తున్నారు.

పీఎంఏఐడీ యాప్ ఏర్పాటు..

రైతు భరోసా కేంద్రంలో ఏర్పాటు చేసిన కియాస్క్ స్థానంలో పీఎంఏఐడీ యాప్‌ను కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దీని వల్ల అరకొర సేవలు మాత్రమే అందుతున్నట్లు రైతులు చెప్తున్నారు. గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన కియోస్క్ యంత్రాలను నిరుపయోగంగా ఉంచడం సరికాదని, ఆ యంత్రాల్లో గతం మాదిరిగానే పూర్తిస్థాయిలో సేవలు అందించాలని రైతులు కోరుతున్నారు.


పెంట్రాలలో నిరుపయోగంగా ఉన్న కియోస్క్

ఎరువులు పూర్తిస్థాయిలో ఇవ్వాలి..



రైతులకు అవసరమైన ఎరువులను అందించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైంది. గతంలో కియోస్క్‌లు ఉంటే అక్కడకు వెళ్లి ఎరువులను బుక్ చేసుకుని తెచ్చుకునే వాళ్లం. ప్రస్తుతం పరికరం పనిచేయడం లేదు. ఎరువులను ప్రైవేటు డీలర్ల వద్ద అధిక ధరలకు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

– దగ్గు వెంకటేశ్వర్లు ఎంపీటీసీ, తిమ్మారెడ్డిపాలెం

కియోస్క్ సేవలు కొనసాగించాలి..



రైతు సంక్షేమానికి గత ప్రభుత్వం ఆర్‌బీకేల్లో ఏర్పాటు చేసిన కియోస్క్ యంత్ర సేవలు ఈ ప్రభుత్వంలో కూడా కొనసాగించాలి. ఎరువులు, పురుగు మందులు నమోదుతో పాటు మార్కెటింగ్ సౌకర్యాలు తెలుసుకునేందుకు యంత్రాలు ఉపయోగపడేవి. రైతులకు ఉపయోగపడే సేవలు కొనసాగించాలి.

-కనపర్తి రంగయ్య రైతు, మేదరమిట్లపాలెం

సమస్యలు పరిష్కరిస్తాం..

అన్ని రైతు సేవా కేంద్రాల్లో కియోస్క్ యంత్రాలు వినియోగంలోనే ఉన్నాయి. విత్తనాల కాలం అయిన తరువాత వాటి వినియోగం తక్కువగా ఉంటుంది. రైతుల సౌలభ్యం కోసం మొబైల్ ద్వారా ఎక్కువ సేవలు అందుతున్నాయి. సమస్యలు ఉంటే గుర్తించి పరిష్కరిస్తాం.

– రవికుమార్, ఇన్‌చార్జ్ ఏవో

క్లుప్తంగా

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి


మాజీ మంత్రి సురేష్‌ను సన్మానిస్తున్న రామకృష్ణ

కొండపి: వలంటీర్ రాష్ట్ర సెక్రటరీగా పార్టీ కేంద్ర కార్యాలయం కొండపికి చెందిన రావులపల్లి రామకృష్ణను నియమించింది. ఈ సందర్భంగా రామకృష్ణ మాజీ మంత్రి వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు కొండపి నియోజకవర్గం ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సురేష్‌ను సింగరాయకొండలోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సురేష్ నియోజకవర్గంలో పార్టీ పటిష్టతకు కృషి చేయాలని రామకృష్ణకు సూచించారు. రామకృష్ణ మాట్లాడుతూ నాకు ఈ పదవి రావడానికి సహకరించిన వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి, పార్టీ జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్ రెడ్డికి, మాజీ మంత్రి సురేష్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపాడు. కార్యక్రమంలో రాష్ట్ర ఐటీ వింగ్ జోనల్ ప్రెసిడెంట్ మణికంఠేశ్వర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సంఖ్య పెంచేందుకు కృషి చేయాలి


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న జగన్నాథరావు

టంగుటూరు: ఫౌండేషన్ స్కూళ్లలో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు తగిన కృషి చేయాలని జిల్లా పర్యవేక్షణ బృంద సభ్యుడు డైట్ అధ్యాపకుడు ఆర్ జగన్నాథరావు అన్నారు. శుక్రవారం మండలంలోని కారుమంచి ఆదర్శ పాఠశాల ఫౌండేషనల్ ప్రాథమిక పాఠశాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కారుమంచిలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి సూచనలు అందించారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు సుధాకర్, బాలకోటయ్య, సుబ్బాచారి, జవహర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎరువులు అధిక ధరలకు అమ్మితే చర్యలు


ఎరువుల షాపును తనిఖీ చేస్తున్న అధికారులు

పొన్నలూరు: ఎరువుల షాపుల్లో నిల్వ ఉన్న ఎరువుల వివరాలను బోర్డు ద్వారా రైతులకు తెలియజేయాలని ఒంగోలు విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి రవిబాబు అన్నారు. మండలంలోని పొన్నలూరు, కే అగ్రహారంలో ఎరువుల షాపులను శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువులను కేటాయించిన ధరలకు మాత్రమే విక్రయించాలన్నారు. ప్రభుత్వం సూచించిన ధరను కాకుండా అధిక ధరలకు అమ్మితే చర్యలు తీసుకుంటామన్నారు. ఎరువులకు సంబంధించిన స్టాక్ వివరాలతో పాటు ధరలను తెలియజేస్తూ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. రైతులకు ఎరువులు విక్రయించిన తరువాత కచ్చితంగా రశీదు ఇవ్వాలన్నారు. అవకతవకలకు పాల్పడితే లైసెన్స్ రద్దు చేస్తామన్నారు. కార్యక్రమంలో విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ తహసీల్దార్ వీఎస్ పాల్, ఏవో రాము, వ్యవసాయ విస్తరణ అధికారి సుధీర్‌కుమార్ పాల్గొన్నారు.

వెంకట్రావు మృతి పార్టీకి తీరని లోటు


వెంకట్రావు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న సురేష్

టంగుటూరు: వైఎస్సార్ సీపీ నాయకుడు మార్టూరి వెంకట్రావు అకాల మరణం పార్టీకి తీరని లోటని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు, కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. మండలంలోని కాకుటూరివారిపాలెం గ్రామ నాయకుడు మార్టూరి వెంకట్రావు మృతి చెందాడని తెలుసుకున్న సురేష్ వెంకట్రావు కుటుంబ సభ్యులను పరామర్శించి, ధైర్యం చెప్పి వారికి పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. ఆయన వెంట రాష్ట్ర అధికార ప్రతినిధి బొట్ల రామారావు, జిల్లా బూత్ కమిటీ అధ్యక్షుడు పుట్టా వెంకట్రావు, ఎంపీటీసీ కొమ్ము ప్రభుదాసు, మల్లవరపు కోటిరెడ్డి, దుగ్గిరాల పేర్రాజు, తన్నీరు వీరనారాయణ, తోట్టెంపూడి సురేష్, శ్రీపతి విజయ్, రాములు, తదితరులు పాల్గొన్నారు.

పొగాకు సరాసరి ధర రూ. 212.78

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రం పరిధిలో శుక్రవారం నిర్వహించిన వేలంలో పొగాకు గరిష్ట ధర రూ. 300 పలికిందని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు పేర్కొన్నారు. జమ్ములపాలెం, తూమాడు గ్రామాలకు చెందిన రైతులు 719 బేళ్లను వేలాని తీసుకురాగా వాటిలో 553 కొనుగోలు జరిగగా, 166 బేళ్లు తిరస్కరణ జరిగాయి. గరిష్ట ధర రూ. 300, కనిష్ట ధర రూ. 130 పలకగా, సరాసరి రూ. 212. 78 ధర పలికింది. ఈ వేలంలో మొత్తం 41 మంది వ్యాపారులు పాల్గొన్నారని ఆయన తెలిపారు.

వినాయకుడి పూజల్లో వైఎస్సార్ సీపీ నాయకులు

సింగరాయకొండ: మండల కేంద్రంలోని వైఎస్సార్ సీపీ క్యాంపు కార్యాలయంలో వినాయక చవితి పర్వదినం సందర్భంగా ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పూజలు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమంలో పాల్గొని తరువాత ఉట్టి వేడుకలలో పాల్గొని స్వయంగా ఉట్టి కొట్టి కార్యకర్తలను, నాయకులను ఉత్సాహపరిచారు. మసనం వెంకట్రావు ఆధ్వర్యంలో వినాయక విగ్రహాన్ని పుర వీధుల్లో ఊరేగించి పాకల సముద్రంలో నిమజ్జనం చేశారు. చొప్పర వెంకన్న, షేక్ సుల్తాన్, గాదంశెట్టి గుప్తా, చుక్కా కిరణ్‌కుమార్, సోమిశెట్టి సురేష్, షేక్ కరీం, గోళ్లమూడి అశోక్‌రెడ్డి, పెరికాల సునీల్, మాదాల శంకర్, కోమిట్ల వెంకారెడ్డి, నరేష్, నాగచైతన్యరెడ్డి, పురిణి దేవ, చిరుమామిళ్ల వెంకటేశ్వర్లు, షేక్ నౌషాద్, బుజ్జమ్మ, గాదంశెట్టి విజయ్, కొల్లూరు సాయికోటి, భాగ్యమ్మ, చామల ఉదయశంకరరెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి దద్దాల పూజలు..

పామూరు: మండలంలోని బొట్లగూడూరు, మోపాడు, మోపాడు బంగ్లాలో వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జ్ డాక్టర్ దద్దాల నారాయణయాదవ్ జెడ్పీటీసీ చప్పిడి సుబ్బయ్య, మండల పార్టీ అధ్యక్షుడు గంగసాని హుసేన్‌రెడ్డిలతో కలిసి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. పామూరులోని కందుకూరు రోడ్డులో ఏర్పాటు చేసిన విగ్రహంవద్ద తహసీల్దార్ వాసుదేవరావు, సీఐ ఎం.భీమానాయక్, పామూరు, సీఎస్‌పురం ఎస్సైలు టి.కిషోర్‌కుమార్, ఎం.వెంకటేశ్వరనాయక్, సింగిల్‌విండో మాజీ చైర్మన్ బోయళ్ల నారాయణరెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ చప్పిడి సుబ్బయ్య, పార్టీ మండల అధ్యక్షుడు గంగసాని హుసేన్‌రెడ్డి, కల్లూరి రామిరెడ్డి, అంబటి కొండారెడ్డి, ఎంపీటీసీ పోలినేని శ్రీనివాసులు, గట్లా విజయభాస్కర్‌రెడ్డి, శ్రీరామ శ్రీనివాసులు, ఆవుల భాస్కర్‌రెడ్డి, జి.ఆదినారాయణ, కొల్లూరి రవికిరణ్ శర్మ, షేక్.గయాజ్, సర్పంచ్ చప్పిడి వరలక్ష్మి, జి.నారాయణ, ఆవుల రామకృష్ణ, పి.శ్రీనివాసపులు, వై.రమేష్, పి.నరేంద్ర, ఎ.మోహన్‌రెడ్డి, బొట్ల హజరత్, బోయల మాధవరెడ్డి, పి.రమణారెడ్డి, కే.జగన్‌మోహన్‌రెడ్డి, జి.తిరుపతిరెడ్డి, వాకమళ్ల కోటిరెడ్డి, యం.నారాయణ, డేగా నారాయణ, యం.మహేష్ పలువురు మహిళలు పాల్గొన్నారు.

మద్దిపాడు: మండల కేంద్రమైన మద్దిపాడు పడమటి బజారులోని రామాలయం వద్ద వైఎస్సార్ సీపీ యూత్‌ఫోర్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విగ్రహం వద్ద భక్తులకు అన్నదానం చేశారు.


బొట్లగూడూరులో వినాయక పూజల్లో ఇన్‌చార్జ్ దద్దాల, నాయకులు


వైఎస్సార్ సీపీ కార్యాలయంలో అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి సురేష్

పోయిరావయ్యా.. ఉండ్రాలయ్యా !

పీసీపల్లి: మండల పరిధిలోని మూడు రోజులపాటు భక్తి శ్రద్ధలతో వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించిన భక్తులు మూడోరోజు నిమజ్జనం చేశారు. అన్నదానాలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు, ఆటపాటలు నిర్వహించి నిమజ్జనం చేశారు. మండల పరిధిలోని గోపవరపువారిపల్లిలో నాగిరెడ్డి మహేందర్ రెడ్డి రూ. 37,500 లడ్డును వేలం పాటలో దక్కించుకున్నాడు.

సింగరాయకొండ: పాకల బీచ్‌లో శుక్రవారం వినాయక నిమజ్జనాలు జరిగాయి. నిమజ్జనాల సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్సై మహేంద్ర పోలీసు సిబ్బందికి ప్రత్యేక సూచనలు ఇచ్చి ఏర్పాట్లను పర్యవేక్షించారు. వైఎస్సార్ సీపీ క్యాంపు కార్యాలయంలో వినాయకుడికి మాజీ మంత్రి సురేష్ పూజలు నిర్వహించి నిమజ్జనానికి తరలించారు.


వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద వినాయక విగ్రహాన్ని నిమజ్జనానికి తరలిస్తున్న సురేష్

టంగుటూరు: జమ్ములపాలెం గ్రామంలో చిన్నారులు పర్యావరణానికి హాని కలగకూడదని మట్టి గణపతిని ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామస్తులు అభినందించారు.


పాకల సముద్రంలో వినాయకుడిని నిమజ్జనం చేస్తున్న భక్తులు


గోపవరపువారిపల్లిలో గణనాథుని నిమజ్జనానికి తీసుకెళ్తున్న గ్రామ యువకులు


జమ్ములపాలెంలో పూజలందుకుంటున్న మట్టి వినాయకుడు

ఖాదర్‌బాషా భౌతిక కాయానికి దద్దాల నివాళి

కనిగిరిరూరల్: పట్టణంలోని 8వ వార్డుకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు, సోషల్ మీడియా కార్యకర్త ఎస్‌కే ఖాదర్‌బాష(44) మృతి చెందాడు. ఖాదర్ బాషా భౌతిక కాయాన్ని శుక్రవారం పార్టీ కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణయాదవ్, పార్టీ నేతలు సందర్శించి పూల మాలలు వేసి, నివాళులర్పించారు. ఖాదర్ బాష కుటుంబానికి పార్టీ ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ రూ.20 వేలు ఆర్థిక సాయం అందచేశారు. కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. ధైర్యంగా ఉండాలని, పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని దద్దాల భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, కౌన్సిలర్లు జాస్మిన్ షఫీ ఆజాద్, సయ్యద్ రిజ్వానా ఖాలక్, రామనబోయిన శ్రీనివాసులు, తూము వెంకట కృష్ణారెడ్డి, ఎస్‌కే ఖాశింవలి, మీరావలి, రెహమాన్, నాగూర్‌వలి, మాజీ ఎంపీటీసీలు ఎస్‌కే జిలాని, ఎస్‌కే ఫయాజ్, ఎస్‌డీ నాయబ్ రసూల్ తదితరులున్నారు. అలాగే ఖాదర్ బాషా భౌతిక కాయాన్ని పీడీసీసీబీ మాజీ చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి, ఎంపీపీ దంతులూరి ప్రకాశంలు వేర్వేరుగా సందర్శించి నివాళులర్పించారు.


ఖాదర్ బాషా భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న దద్దాల, పార్టీ నేతలు

బాల మాదార్ భౌతికకాయానికి నివాళి..

పట్టణంలోని ఎన్జీవో కాలనీకి చెందిన నియోజకవర్గ నూర్‌బాష సంఘం మాజీ అధ్యక్షుడు కారుమంచి బాల మాదార్ భౌతిక కాయాన్ని దద్దాల నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, జెడ్పీటీసీ, బీసీ, ఉద్యోగ సంఘాల నాయకులు పెన్నా వెంకటేశ్వర్లు, దద్దాల శ్రీనివాసులు, దేపూరి వెంకటేశ్వర్లు, మాజీ కౌన్సిలర్ ఎస్‌కే షరీఫ్, శ్రీను, తూము కృష్ణారెడ్డి, వంకదారి రాజు, కేతినేని నరసింహ పాల్గొన్నారు.

పార్టీ విజయానికి సైనికుల్లా పనిచేద్దాం


పామూరు: వైఎస్సార్ సీపీ విజయానికి ఐక్యంగా సైనికుల్లా పనిచేద్దామని పామూరు మండల ఎంపీపీ, వైఎస్సార్ సీపీ ప్రకాశం జిల్లా మహిళా విభాగం జోనల్ ప్రెసిడెంట్, నెల్లూరు జిల్లా ఇన్‌చార్జ్ జోనల్ ప్రెసిడెంట్ గంగసాని లక్ష్మి అన్నారు. శుక్రవారం నెల్లూరులో రాష్ట్ర అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి ముఖ్య అతిథిగా పార్టీ కార్యాలయంలో జరిగిన మహిళా విభాగం కార్యక్రమాల్లో ఆమె పాల్గొన్నారు. ఈసందర్భంగా గంగసాని లక్ష్మి జోనల్ కమిటీలు, మండల కమిటీలు, రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న దాడులు, మహిళానేతలపై కేసులు, పార్టీ పరంగా అధికార పార్టీ అక్రమాల, అరాచకాలను మహిళల్లోకి తీసుకుపోవడంపై చర్చించారు. అనంతరం ఎమ్మెల్సీని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర జోనల్ మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ కల్యాణి పూజిత, సుహాసిని, పద్మ, పందిటి లక్ష్మి, జమీలా, పలువురు పార్టీ మహిళాసంఘం నాయకులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ కల్యాణిని సన్మానిస్తున్న లక్ష్మి, నాయకులు

రేషన్ పంపిణీలో అవకతవకలు జరిగితే చర్యలు

జరుగుమల్లి(సింగరాయకొండ): నిత్యావసర వస్తువుల పంపిణీలో అవకతవకలు జరిగితే కఠిన చర్యలు తప్పవని తహశీల్దార్ పీ మురళి హెచ్చరించారు. జరుగుమల్లి మండలంలోని పలు గ్రామాలలో రేషన్ షాపులు, పెట్రోలు బంకు, వాటర్ ప్లాంట్‌ను శుక్రవారం ఆయన స్వయంగా పరిశీలించారు. తహశీల్దార్ మురళి మాట్లాడుతూ పాలేటిపాడు, తూమాడు, సాదువారిపాలెం గ్రామాలలోని రేషన్ షాపులను తనిఖీ చేశామని రికార్డులకు, నిల్వకు తేడా లేదన్నారు. చిర్రికూరపాడులో పెట్రోలు బంకును తనిఖీ చేయగా పెట్రోలు క్వాలిటీ బాగా ఉందని బంకులో ఎయిర్ మిషన్ లేదని నెల లోపు ఏర్పాటు చేయాలని ఆదేశించామన్నారు. గ్రామంలోని వాటర్‌ప్లాంట్‌ను పరిశీలించామని బాగా ఉందన్నారు. ఆర్ఐ జీవీ ప్రసూన, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.


రేషన్‌షాపును తనిఖీ చేసిన తహశీల్దార్ మురళి

తెలుగుభాష వైభవానికి గిడుగు పునాది

కొండపి: తెలుగు భాషా వైభవానికి పునాదులు వేసిన మహనీయుడు గిడుగు రామ్మూర్తి పంతులని ముప్పవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం బీ. కోటిరెడ్డి అన్నారు. శుక్రవారం తెలుగు భాష దినోత్సవ సందర్భంగా స్థానిక పాఠశాలలో తెలుగు భాష దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు భాషను గ్రాంథికం నుంచి వ్యవహారిక భాషలోనికి తీసుకొని రావడానికి విశేష కృషి చేసిన వ్యక్తి గిడుగు రామ్మూర్తి అన్నారు. అనంతరం తెలుగు ఉపాధ్యాయుడు గవిని శివశంకర ఆధ్వర్యంలో విద్యార్థులకు తెలుగు కవితల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. అమ్మ కవిత ప్రథమ బహుమతి సాధించినట్లు తెలిపారు. అనంతరం ప్రముఖ హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ పుట్టినరోజు సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకొని పీఈటీ జ్వాలా లక్ష్మి క్రీడా దినోత్సవ విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎల్వీ ప్రసాద్ శ్రీదేవి, చారి, రాజ్యలక్ష్మి, శ్రీలక్ష్మి, అనూరాధ, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు. ఉప్పలపాడులో హెచ్‌ఎం వీ సూసన్న కుమార్ తెలుగు భాష దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవం జరిపారు. కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ రాఘవేంద్ర శర్మ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.


ముప్పవరంలో తెలుగు కవుల చిత్రపటాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు


మద్దిపాడులో ధ్యాన్‌చంద్, గిడుగు చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

విద్యార్థులకు వక్తృత్వ పోటీలు..

మద్దిపాడు: తెలుగు భాష, క్రీడా దినోత్సవం సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం రెబ్బా వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వినాయకుడి లడ్డూ రూ. 92 వేలు


నారాయిపల్లిలో లడ్డును దక్కించుకున్న రమణయ్య

కనిగిరిరూరల్: పట్టణంతో పాటు, పలు గ్రామాల్లో విఘ్నేశ్వరునికి ప్రత్యేక పూజలు జరుగుతున్నాయి. మూడో రోజు కావడంతో పలు చోట్ల నిమజ్జనోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. మండలం లింగారెడ్డిపల్లిలో జరిగిన గణపతి లడ్డును వేలం పాటలో వైఎస్సార్ సీపీ నాయకుడు చందా నరసారెడ్డి పాల్గొని రూ.35 వేలకు పాడుకున్నారు.

హనుమంతునిపాడు: మండల పరిధి హనుమంతాపురం పంచాయతీ పరిధి నారాయిపల్లి గ్రామంలో వైఎస్సార్ సీపీ కార్యకర్త జట్టిబోయిన రమణయ్య రూ.92 వేలకు స్వామి వారి లడ్డు పాట దక్కించుకున్నారు. అనంతరం సంబరాలు చేసుకుంటూ నిమజ్జనానికి తరలించారు.